ప్రజాశక్తి

ఆదివారం 25 జూన్ 2023   8 పేజీలు



గుంటూరు



పల్నాడు

షాక్ కొడ్తున్న కరెంటు బిల్లులు

- సర్దుబాటు ఛార్జీల మోత - వినియోగదారులకు వాత
- ప్రతి బిల్లులకు రూ.200 నుంచి రూ.500 వరకు అదనపు భారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మేడికొండూరులో బి.వీరయ్య అనే ఇంటి యజమానికి 131 యూనిట్లకు సాధారణ ఛార్జీ రూ. 453 కాగా, ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం రూ.691 బిల్లు వచ్చింది. ఇందులో 36 నెలల్లో భాగంగా 11వ నెల ట్రూఅప్ ఛార్జీ రూ.42, 2021మేనెలలో ఎఫ్‌పిపిసిఏ ఛార్జీలు రూ.61, 2023 ఏప్రిల్ నెల భారం రూ. 40, సాధారణ సర్‌ఛార్జి రూ.25, కస్టమర్ ఛార్జీ రూ. 50, ఫిక్స్‌డ్ ఛార్జీ 10, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.7 ఇలా అదనపు భారం దాదాపు రూ. 238 అదనపు భారం వేశారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా గృహ విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం విపరీతమైన భారం మోపుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 17.50 లక్షల మందిపై వినియోగదారులు ఉండగా వీటిల్లో 16 లక్షల మంది పేద, మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారు. జిల్లా వాసులపై ఏటా రూ.60 కోట్లకుపైగా అదనపు భారం పడుతోంది. సాధారణ వినియోగ ఛార్జీలతో పాటు ట్రూఅప్ ఛార్జీలు ప్రతి యూనిట్‌కు సగటున 1.50 పైసలు భారం పడనుంది. వీటిపై స్థిర ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, బిల్లు చెల్లింపులో ఆలస్యానికి అదనపు రుసుము కూడా పడనుంది. గత నాలుగేళ్లలో ఏడుసార్లు ఛార్జీలను పెంచారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ట్రూ అప్ చార్జీల పేరుతో

ప్రతి నెలా వసూలు చేస్తున్నారు. ట్రూఅప్ ఛార్జీల పేరుతో 36 నెలల పాటు అదనపు ఛార్జీలను వసూలు చేస్తున్నట్టు విద్యుత్ బిల్లును వసూలు చేస్తున్నారు. ఇప్పటికి 10 నెలలుగా ఈఛార్జీలను వసూలు జరుగుతోంది. ట్రూఅప్ వల్ల ప్రతినెలా రూ.30 నుంచి రూ.100 వరకు



అదనపు భారం పడుతోంది. 2014-2019లో డిస్కంలకు వచ్చిన నష్టాలకు సంబంధించి ఇప్పుడు వసూలు చేయడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈఛార్జీల వసూలు పరంపర కొనసాగిస్తూనే తాజాగా 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన డిస్కంలకు వచ్చిననష్టాలకు కూడా గత నెల బిల్లు నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. యూనిట్‌కు రూ.40 పైసలు అదనంగా వసూలు

2 లో

రెండు యూనిట్లకు రూ.129



మేడికొండూరుకు చెందిన షేక్ బాజీ గత నెలలో ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాడు. కేవలం రెండు యూనిట్లు మాత్రమే రీడింగు నమోదయింది. కరెంటు వాడుకోకుండానే సర్చార్జీలతో కలుపుకుని రూ.129 రూపాయలు బిల్లు వచ్చిందని బాజీ వాపోయాడు.

నెలకు రూ.200 అదనపు భారం



మాది పేద కుటుంబం ప్రతినెల 600 రూపాయలు బిల్లు వస్తుంది. ఈనెలలో రూ.800 బిల్లు వచ్చింది. రూ.200 వరకు వివిధ రకాల ఛార్జీలు వేశారు. ట్రూఅప్, 2021 మే నెలలో వాడుకున్న విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీ, 2023 ఏప్రిల్ నెలలో సర్దుబాటు ఛార్జీల రూపంలో రూ.200 అదనంగా బిల్లు వేశారు. వినియోగం తక్కువగా ఉన్నా బిల్లులు అదనంగా వస్తున్నాయని మేడికొండూరుకు చెందిన బి.రమేష్ వాపోయారు.



టిడిపి, వైసిపి కార్పొరేటర్ల వాగ్వాదం

గుంటూరు కార్పొరేషన్‌లో గలభా

ఎమ్మెల్యే ముస్తాఫా ఆక్రందన - మేయర్, కమిషనర్ మౌనం

అధికార పార్టీలో విభేదాలు బహిర్గతం - సమస్యలపై ధ్వజమెత్తిన కార్పొరేటర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలకసంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశంలో రెండో రోజు శనివారం కూడా కొనసాగింది. సమావేశానికి మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించారు. ఎజెండాలోని పలు అంశాలపై చర్చ జరిగింది. అధికార పార్టీలోని వర్గ విభేదాలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే ముస్తాఫా రెండో రోజు కూడా తన ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు. నగరంలోని ఐదో డివిజన్‌లో రూ.లక్ష వ్యయంతో నిర్మించాల్సిన కల్వర్టు ఇంత వరకు చేపట్టలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా చెప్పినా కేవలం రూ. లక్ష వ్యయంతో చేపట్టాల్సిన పనిని కూడా పెండింగ్‌లో పెట్టారని అధికారులపై ధ్వజమెత్తారు. రూ.50 లక్షలతో డివైడర్‌లు నిర్మించుకుని కమీషన్లు తీసుకునేందుకు అధికారులు ముందుకు వస్తారని ప్రజల కోసం రూ.లక్షతో కల్వర్టు కట్టమని కల్టడంలేదని తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉండటం దేనికి? చిన్న పనులు కూడా చేయలేకపోతున్నా మన్నారు. ప్రజల్లో చులకన అవుతున్నామని వచ్చే ఎన్నికల్లో ఏం సమాధానం చెబుతామని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన ఎఈని సమావేశానికి పిలవాలని కోరారు. ఎమ్మెల్యే దాదాపు 20 నిమిషాలు తన ఆక్రందన వ్యక్తం చేసినా మేయర్, కమిషనర్ ఏ మాత్రం వారించ లేదు. ఎస్‌ఈ భాస్కరరావు మాట్లాడుతూ త్వరలో ఈ పని చేపడతా మని నెల రోజుల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. చిన్నపనికి ఎందుకు జాప్యం చేస్తున్నారని వెంటనే చేయండి అని మాత్రమే మేయర్ అధికారులకు సూచించారు. మురికి వాడల్లో అభివృద్ధి పనులపై బడ్జెట్‌లో కేటాయింపులపై డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు మాట్లాడు తుండగా వైసిపి కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి,

2 లో

రాజధాని రైతులకు కౌలు రూ. 240 కోట్లు విడుదల

2లో

రాజధాని అసైన్డ్ రైతుల కౌలు చెల్లించాలి : సిపిఎం

7లో



మాట్లాడుతున్న రేట్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి ఆంజనేయులు

ప్రభుత్వ విధానాలతో విద్యుత్ భారాలు

ఫాక్వా ఆధ్వర్యంలో చర్చాగోష్టిలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ విధానాల వల్లే ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడుతుందని, కావున విద్యుత్ తయారీ, పంపిణీ బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని విజయవాడ రేట్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులు అన్నారు. అదనపు విద్యుత్ చార్జీల భారం, అప్రకటిత విద్యుత్ కోతలు తదితర అంశాలపై ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఫాక్వా) ఆధ్వర్యంలో శనివారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో చర్చాగోష్టి నిర్వహించారు. ఫ్వాక్వా నాయకులు ఎల్.ఎస్.భారవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మానవ జీవితం విద్యుత్‌తో ముడిపడి ఉందని, విద్యుత్ ఉంటేనే అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు.

2 లో



మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

30న విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ధర్నాలు

- వామపక్ష పార్టీల పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈ నెల 30న విద్యుత్ కార్యాలయాలు, సబ్‌స్టేషన్‌ల వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాలు, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వామపక్షపార్టీలు పిలుపునిచ్చాయి. శనివారం బ్రాడిపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సిపియం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గనిరాజు, నరసింహరావు, ఎమ్.సిపిఐ(యు) జిల్లా కార్యదర్శి కె.శ్రీధర్, సిపిఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, సిపిఐ(ఎమ్.ఎల్)రిబరేషన్

2 లో



మాట్లాడుతున్న సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య

మరో విద్యుత్ పోరాటం

28న సత్తెనపల్లిలో రాజకీయ పార్టీల ధర్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజలు కరెంటు కాల్చుకున్న యూనిట్ల కంటే సర్దుబాటు చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు పేరుతో అనేక రెట్లు పెరిగిన విద్యుత్ ఛార్జీలు ప్రజల నడ్డి విరిగేలా ఉందని సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య అన్నారు. ఈ పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని లేకుంటే బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. శనివారం స్థానిక పుతుంబాక భవన్లో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కొమ్మిశెట్టి సాంబశివరావు, 7వ వార్డు కౌన్సిలర్ రంగశెట్టి సుమన్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కట్ట శివ దుర్గారావు, అనుముల వీరబ్రహ్మం,

2 లో

30న విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా నాయకులు రాందేవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర విధానాల వల్ల నిత్యజీవితావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెద్ద ఎత్తున పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచిందన్నారు. 2014 నుండి 2019 వరకు విద్యుత్ కొనగొళ్ళలో వచ్చిన నష్టాలు రూ.2900 కోట్లను ప్రజలపై భారాలు మోపారన్నారు. స్మార్ట్ మీటర్ల పేర మరో భారం వేయడానికి ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయన్నారు.కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టాన్ని తెచ్చి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వున్న విద్యుత్‌ను కేంద్ర పరిధిలోకి తెచ్చి రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం ఒత్తిడికి తలొగ్గి వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈవిధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్థ నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని వాగ్దానం చేసి ఎడాపెడా కోతలు విధిస్తూ, విద్యుత్ చార్జీలు కూడా పెంచుతున్నారని విమర్శించారు. ఈ నేపద్యంలో 30న జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, సిపిఐ జిల్లా నాయకులు అరుణ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, సిపిఐ(ఎమ్.ఎల్) నాయకులు కూరపాటి కోటయ్య, సిపిఐ(ఎమ్.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎన్.కృష్ణ పాల్గొన్నారు.

మరో విద్యుత్ పోరాటం

టిడిపి నాయకులు, మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు ఇర్మియా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజ్ పాల్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమాశ్రీ, ఎస్ ఎఫ్ ఐ జిల్లా నాయకులు అమూల్య, సిఐటియు నాయకులు మామిడి జగన్నాధ రావు ,డివైఎఫ్ఐ నాయకులు జడ రాజ్ కుమార్ లు మాట్లాడుతూ గత ఎన్నికలలో ప్రజల వద్దకు వచ్చి హామీలను ఇచ్చి ఎన్నికల్లో గెలిచిన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను మరిచి ఇప్పటికి ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారని విమర్శించారు. ఇప్పటికే ఆస్తి పన్ను, చెత్త పన్ను, పెట్రోల్ డీజిల్ ధరలతో పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకంపై ఈ పెరిగిన విద్యుత్ చార్జీలు మరింత భారం కానున్నాయని విమర్శించారు. వేసవికాలంలో తట్టుకోలేక ఫ్యాన్లుగాని, కూలర్లు గాని వేసుకుంటే 300 యూనిట్లు దాటిందని సంక్షేమ పథకాలను రద్దు చేయడం దారుణమని అన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉండాల్సిన విద్యుత్ శాఖను కేంద్ర ప్రభుత్వం లాగేసుకొని నూతన విద్యుత్ చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. ఈ విద్యుత్ చట్టం వలన ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీక్ అవర్స్ అనే చట్టం తీసుకు వచ్చిందని దీనివలన సాయంత్రం వేళలో ఎక్కువమంది విద్యుత్ వినియోగించుకునే సమయంలో అధిక చార్జీలను వేసి మిగతా సమయంలో మామూలు చార్జీలు వేసే విధానాన్ని తీసుకువచ్చిందని ఇది చాలా దారుణమని అన్నారు. దానిలో భాగంగానే ఈనెల 28న సత్తెనపల్లి తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేయడం జరిగింది. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు రొంపిచర్ల పురుషోత్తం, పెండ్యాల మహేష్, అనంత వెంకట్ నారాయణ, అవ్వారు ప్రసాద్ రావు, కోరంపల్లి జగన్, పొట్టి సూర్య ప్రకాశరావు, పంతంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో విద్యుత్ భారాలు

అయితే ప్రభుత్వాలు మాత్రం ప్రజలకు తక్కువ ధరకు విద్యుత్ అందించే బాధ్యత నుండి తప్పుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతున్నారని అన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయటం వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయన్నారు. రెండు, మూడు రూపాయాలకు కొనుగోలు చేయాల్సిన విద్యుత్‌ను రూ.10లు, రూ.20లకు కొంటున్నారన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాల పేరుతో విదేశాల నుంచి బొగ్గును 2021-22 లో రూ.12211లకు, 2022-23లో రూ.19324లకు కొనుగోలు చేశారని, కానీ రూ..6600లకే టన్ను హైగ్రేడ్ బొగ్గు దేశీయంగా అందు బాటులో ఉన్నా కొనుగోలు చేయలేదన్నారు. ఇలాంటి విధానాల ఫలితంగా విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయని, తిరిగి వాటిని ప్రజలపైనే భారాలు మోపుతున్నారని, పాలకులు ప్రైవేటు కంపెనీలకు లాభాలు దోచిపెడుతున్నారని విమర్శించారు. త్వరలో మొబైల్ రీచార్జ్ మాదిరిగా కరెంటుకూ ప్రీపెయిడ్ విధానం వస్తుందన్నారు. కోల్డ్ స్టోరేజి ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సరేంద్రబాబు మాట్లాడుతూ ఒక వైపు రైతులకు కోల్డ్ స్టోరేజిల్లో అద్దెలు పెంచలేక, మరోవైపు ప్రభుత్వం విధిస్తున్న అధిక విద్యుత్ చార్జీల భారాలు మోయలేక కోల్డ్ స్టోరేజిల ఓనర్లు సతమతం అవుతున్నారన్నారు. ఇప్పటికే అనేక కోల్డ్ స్టోరేజీలో సిక్‌లోకి వెళ్లాయన్నారు. ఇదే విధానాలు కొనసాగితే పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గుంటూరు పౌర సంఘాల సమాఖ్య నాయకులు నళినీకాంత్, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు పరంధామయ్య, ఎస్‌హెచ్ఒ అధ్యక్షులు డాక్టర్ సేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కార్పొరేషన్‌లో గలభా

(మొదటి పేజీ తరువాయి)

అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ బాబు అడ్డుతగిలారు. ఇందుకు ఎమ్మెల్యే ముస్తాఫా అగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం పద్ధతి సభను ఆర్డర్‌లో పెట్టాల్సిన బాధ్యత మేయర్‌గా మీ పైన ఉందని ఈవైఖరి సరికాదని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు ఇస్తే మారుస్తారని ఇందుకోసం అర్ధగంట ప్రసంగం ఎందుకుని వైసిపికార్పొరేటర్లు ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, రోషన్ పేర్కొన్నారు. మాట్లాడితే 57 మంది కార్పొరేటర్ల అంశం అని పేర్కొనడం సరికాదన్నారు. డైమండ్‌బాబు మాట్లాడుతూ గత బడ్జెట్‌లో మాదిరిగా కాకుండా ఈసారి అయినా ముందుగా డివిజన్ కార్పొరేటర్లనుంచి ప్రతిపాదనలు కొరాలని చెప్పారు. మురికివాడలకు, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.



ఆశీలు వసూలు నిలిపివేత :కమిషనర్

కౌన్సిల్ ఆమోదం లేకుండా ఆశీలు వసూలు చేయడాన్ని పలువురు కార్పొరేటర్లు తప్పుపట్టారు.ఇందుకు ప్రత్యేకంగా టెండర్లు పిలవాలని అప్పటివరకు ఎటువంటి వసూలు చేయరాదని సమావేశం తీర్మానించింది. ఈమేరకు కమిషనర్‌ప్రకటన విడుదల చేశారు. వీధి వ్యాపారుల నుండి ఆశీలు వసూళ్లు నిలిపివేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో స్ట్రీట్ వెండింగ్ విధానం అమలు, స్ట్రీట్ వెండింగ్ యాక్ట్ 2014 ప్రకారం బైలాస్ తయారు చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపామని, ప్రభుత్వం నుండి తగు ఆమోదం వచ్చే వరకు నగరంలోని వీధి వ్యాపారుల నుండి ఎటువంటి ఆశీలు వసూళ్లు చేయకూడదని కౌన్సిల్ నిర్ణయం చేసిందన్నారు. ప్రభుత్వం అనుమతి వచ్చిన తర్వాత సదరు పాలసీ మేరకు నిర్ణయించిన ఫీజులను నగరపాలక సంస్థ చేత ధ్రువీకరించిన వెండర్ నెలవారిగా వసూళ్లు చేయడం జరుగుతుందని, ప్రస్తుతం ఎవరైనా ఆసీలు వసూళ్లు చేస్తే వారి పై నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై తప్పుడు సమాచారం

అంతకు ముందు నగరపాలకసంస్థలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి తప్పుడు సమాచారం ఇచ్చిన మాట వాస్తవమేనని కమిషనర్ చేకూరి కీర్తి అంగీకరించారు. ఈ మేరకు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం ఇస్తూ గత రెండేళ్లలో 105మందిని ఉంటే 48 మంది మాత్రమే నియమించినట్టు అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారు.ఇంజినీరింగ్ విభాగం సెక్షన్ సూపరింటెండెంట్ తప్పిదమని తేలిందని కమిషనర్ అన్నారు. కౌన్సిల్ ఏర్పడిన నాటి నుండి నియామకం చేసిన అవుట్ సోర్సింగ్ కార్మికుల వివరాలు అందించుటలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంజనీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్న కౌన్సిల్ తీర్మానం చేసిందని మేయర్ కావటిమనోహర్‌నాయుడు తెలిపారు. రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి నగర పాలక సంస్థ పాలకవర్గం కషి చేస్తుందని, అభివద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు.రెండు రోజులపాటు జరిగిన సమావేశంలో పలు అంశాల పై కార్పొరేటర్లు అడిగిన 94 ప్రశ్నల పై విస్తత చర్చ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 358 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. నగర పాలక సంస్థ కార్పొరేటర్ల కుటుంబ సభ్యులకు యన్.టి.ఆర్ మునిసిపల్ స్టేడియంలో సభ్యత్వం కల్పిస్తూ నిర్ణయించామన్నారు. నగరంలో వీధి కుక్కలా నియంత్రణ పై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.కార్పొరేటర్లు తమ వార్డులలో ప్రస్తావించిన సమస్యలపై మేయర్,కమీషనర్, ఉన్నతాధికారులు క్షేత్ర స్తాయిలో పర్యటిస్తారన్నారని తెలిపారు.

బోగస్ ఓట్లపై టిడిపి, వైసిపి మధ్య మళ్లీ వివాదం

నగరంలో బోగస్ ఓట్లపై టిడిపి,వైసిపి మధ్య రెండోరోజు వివాదం కొనసాగింది. ఒకే డోరు నెంబరులో ఎక్కువ ఓట్లు ఉంటే వెంటనే తొలగించాలని టిడిపి కార్పొరేటర్లు కోరారు. ఈ సందర్భంగా టిడిపి,వైసిపి కార్పొరేటర్ల మధ్య వాగ్వావాదం జరిగింది. వాలంటీర్లపై టిడిపికార్పొరేటర్లపై అసందర్భ వ్యాఖ్యలు చేయగా వైసిపి వారు వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలన్నారు. బోగస్ ఓట్ల తొలగించాలని కోరుతూటిడిపి కార్పొరేటర్లు నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. అలాగే వివిధ వార్డుల్లోని సమస్యలపై ఎమ్మెల్యే మద్దాలి గిరి, ఎమ్మెల్సీ చంద్రగిరిఏసురత్నం, కార్పొరేటర్లు బూసి రాజలత, ఎల్లావుల అశోక్, ముప్పవరపు భారతి, సంకూరి శ్రీనివాసరావు, చల్లారాజ్యలక్ష్మి, వేముల జ్యోతి, జమ్మాబి, వేములపల్లిశ్రీరాం ప్రసాద్, మానంపద్మశ్రీ, పోలవరపు జ్యోతి, ఈరంటి వర ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

8న సిఆర్‌డిఎ లేఅవుట్లలో నిర్మాణాలకు శంకుస్థాపన

- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

సిఆర్‌డిఎ పరిధిలోని జగనన్న లేఅవుట్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్‌రెడ్డి జులై 8వ తేదీన ఇళ్ల నిర్మాణాలకు శంఖుస్థాపన చేయనున్న దృష్ట్యా అందుకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ , అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి సీఆర్డీఏ పరిధిలోని జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు చేపట్టాల్సిన పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడవ ఆప్షన్ క్రింద గృహాలు నిర్మించుకోదలచిన వారికి సంబంధించి కాంట్రాక్టర్లతో మాట్లాడి నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులకు సంబంధించి బ్యాంక్ అక్కౌంట్లను తెరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమం నాటికి నీటి సరఫరా, విద్యుచ్ఛక్తి , ఇతర మౌలిక వసతులు సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కే.చంద్రశేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం. వెంకట శివరామిరెడ్డి , ఆర్డిఓ ప్రభాకరరెడ్డి , డీఆర్డీఏ, మెప్మా, హౌసింగ్ పీడీలు హరిహరనాథ్, వెంకట నారాయణ, వేణుగోపాల్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, యంటీయంసీ కమిషనర్ శారద తదితరులు పాల్గొన్నారు.

షాక్ కొడ్తున్న కరెంటు బిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

చేయనున్నారు. ఇలా ఏడాది పాటు ఈభారం పడుతుంది. ట్రూఅప్, 2021 మే నెలలో వాడుకున్న విద్యుత్‌కు సర్దుబాటు ఛార్జీ, 2023 ఏప్రిల్ నెలలో సర్ధుబాటు ఛార్జీల రూపంలో మొత్తంగా కనీసం రూ.200 నుంచి గరిష్టంగా రూ.500 వరకు అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారు. వాస్తవంగా వినియోగించుకున్న యూనిట్లకు కన్నా ఇతరఛార్జీల భారం రూ.200 నుంచి రూ.500 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు. రానున్న రెండేళ్లపాటు ట్రూ అప్ చార్జీల భారం కొనసాగనుంది.

అదనపు ఛార్జీల భారం తగదు : బి.రామకృష్ణ, కౌలు రైతు సంఘం నాయకులు



ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను గణనీయంగా పెంచుతోందని కౌలు రైతు సంఘం నాయకులు బి.రామకృష్ణ అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని అన్నారు. గతేడాది కాలంగా వివిధ ఛార్జీల పేరుతో వినియోగం కన్నా బిల్లులు అదనంగా వస్తున్నాయని తెలిపారు. గతంలో ఫిక్స్‌డ్ చార్జి, కస్టమర్ చార్జి ,ఇంధనపు డ్యూటీ పేరుతో అధికంగా వసూలు చేసిందన్నారు. ఇప్పుడు ట్రూ అప్, సర్ ఛార్జీల రూపంలో అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు.

రాజధాని రైతులకు కౌలు రూ. 240 కోట్లు విడుదల

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని రైతులకు వార్షిక కౌలు చెల్లింపు నిమిత్తం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ 240 కోట్లు విడుదల చేయడం జరిగిందని సి ఆర్ డి ఎ కమిషనర్ వివేక్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20,870 మంది రైతులకు 24,149 ఎకరాలకు సంబంధించి రూ 156 కోట్ల 24 లక్షలు కౌలు విడుదలకై ప్రతిపాదనలు సంబంధిత కాంపిటెంట్ అధికారుల నుండి అందాయని,ఇప్పటి వరకు 16,395 మంది రైతులకు రూ 120 కోట్ల56 లక్షలు 18,755 ఎకరాలకు గాను కౌలు చెల్లించుటకు మంజూరు నిమిత్తం సీఎఫ్ఎం ఎస్ కు అప్ లోడ్ చేయటం జరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 164 మంది అసైన్డ్ రైతులకు రూ.98 లక్షల 30 వేలు జమ చేయడం జరిగిందని తెలిపారు.జూన్ నెలాఖరులోగా అర్హులైన రైతు లందరికీ వార్షిక కౌలు చెల్లించుటకు సీఎఫ్ఎంఎస్ లో అప్ లోడ్ చేయుటకు అన్ని చర్యలు తీసుకోవటం జరిగిందని చెప్పారు.సి ఆర్ డి ఎ అదనపు కమిషనర్ కట్టా సింహాచలం,ప్రత్యేక కలెక్టర్ (భూ వ్యవహారాలు) టి చిరంజీవి పర్యవేక్షణలో సంబంధిత కాంపిటెంట్ అధికారులు ఈ విషయముపై పూర్తి కసరత్తు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులందరికీ వార్షిక కౌలు చెల్లించుటకు చర్యలు తీసుకోవటం జరుగుతోందని,ఈ విషయములో ఎవరికైనా సందేహాలు ఉన్నట్లయితే తుళ్లూరులోని సి ఆర్ డి ఎ కార్యాలయంలో నివత్తి చేసుకోవచ్చని తెలిపారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య



ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల కేంద్రంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎస్సీ కాలనీ పట్నంమాలపల్లి లో చోటు చేసు కుంది. స్థానికుల వివరాల ప్రకారం.. వెలగ లేటి నాగరాజు (45) అనే వ్యక్తి తన భార్య అతని నుంచి వెళ్ళిపోయిందని మనస్థాపానికి లోనై తాగుడుకి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని సీఐ బ్రహ్మం, ఎస్సై నాగేంద్రరావు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన రోడ్డు ప్రమాదం



ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం మునిపల్లె గ్రామ శివారు పెట్రోలు బంకు దగ్గర జిబిసి రోడ్డుపై శనివారం తెల్లవారు జామున శ్రీకృష్ణ ట్రావెల్స్ కు చెందిన బస్సు ఎదురుగా వస్తున్న బైకిస్టును తప్పించ బోయి బస్సు రోడ్డు మార్జిన్ లో ఉన్న డివైడర్ ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా యూటర్న్ తీసుకుంది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. బస్సు ఒక్క కుదుపులో డివైడర్ ను ఢీకొని యూటర్న్ తీసుకోవడంతో ప్రయాణికులు ఒక్కసారి భయాందోళన చెంది కేకల వేశారు. క్షణాల్లో ఏం జరిగింది అని బస్సులో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. తెల్లవారుజాము కావడం వర్షం పడటంతో రోడ్డుపై రద్దీ లేకపోవడంతో పెను ఘోర ప్రమాదం తప్పింది.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ హాస్పటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ కళ్యాణి,శ్రీధర్ చంద్ తెలిపారు.ఈ వైద్య శిబిరం నందు మెదడు ,నరములు, గుండె సంబంధిత సమ స్యలు ఎముకలు, కీళ్లు, మోకాళ్ళ నొప్పులు కంటి సమస్యలు చెవి, ముక్కు గొంతు, సమస్యలు దంత సమస్యలను ఉచితంగా పరీక్షించబడునని తెలిపారు .ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండల ప్రజల వినియోగించుకోవాలని కళ్యాణి,శ్రీధర్ చందులు కోరారు.

మోడల్ స్కూల్ లో దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు మోడల్ స్కూల్ లో7,8,9 వ తరగతిలో మిగులు సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ వల్లెపు శ్రీను శనివారం తెలిపారు. ఈ నెల 28వ తేదీ లోపు స్థానిక పాఠశాల వద్దకు వచ్చి దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 30వ తేదీన మోడల్ స్కూల్లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 7,8,9 తరగతులలో వరుసగా 8 సీట్లు, 9 సీట్లు, 22 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. మెరిట్ ఆధా రంగా విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

మంత్రి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అంగరంగ వైభవంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడద ల రజిని జన్మదిన వేడుకలు శని వా రం స్థానిక ఎన్.ఆర్.టి సెంటర్ నందు గల వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో జరిగింది. వై.యస్.ఆర్.సీపీ ప్రముఖ నాయకులు, పాల్గొన్నారు.

జంతువధ నిరోధక చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు

గుంటూరు జెసి రాజకుమారి



జంతు హింస నివారణ సంఘం సమావేశంలో పాల్గొన్న జెసి రాజకుమారి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో బక్రీద్ సందర్భంగా ఈనెల 29న గోవధలు నిరోధించటానికి జిల్లాలోని అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా జంతుహింస నివారణ సంఘం సమావేశంలో జెసి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గోవధ నిరోధక చట్టం-1977 నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో అవులను, చూలు పశువులను, 3 నెలల దూడలు కలిగి ఉన్న పశువులను వధించరాదని, జంతు రవాణా నిబంధనల మేరకు రవాణా సరైన ధృవపత్రం లేకుండా జంతువులను రవాణా చేయరాదని స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు లోబడి, అనుమతించిన జంతువులను మాత్రమే నిర్ణయించబడిన జంతువధ శాలలో మాత్రమే వధ చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చట్టం నిబంధనల పర్యవేక్షణకు జిఎంసి పరిధిలో నాలుగు బృందాలు, తెనాలి, పొన్నూరు, ఎంటిఎంసి పరిధిలో రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, జంతువుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోండి



ప్రజాశక్తి-ఫిరంగిపురం

ప్రభుత్వం దొడ్డిదారిన పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బైరగాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం పొనుగుపాడు గ్రామంలో విద్యుత్ బారాలకు నిరసనగా మహిళలు విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూ -అప్, సర్దుబాటు చార్జీల పేరుతో ఒక్క యూనిట్కు 80 పైసలు చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారని, ఇది కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చడానికే నని విమర్శించారు .గతంలో మూడు లేదా నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఛార్జీలు పెంచే వారని ఇప్పుడు ప్రతి నెల పెంచుతున్నారని ఆయన వాపోయారు .కేంద్రంలోని మోడీ ప్రభుత్వం క్రొత్త విద్యుత్ విధానాన్ని తీసుకువచ్చిందని దానిలో భాగంగానే ఈ చార్జీల పెంపు అని ఆయన చెప్పారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటర్లు బిగించడానికి వ్యవసాయం పంపుసెట్లకు మీటర్లు బిగించడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోందని, దీనివల్ల మరింతగా భారాలు ప్రజలు, రైతులపై పడతాయని విమర్శించారు. 2014 లో చార్జీలు ఇప్పటి బిల్లులో వేయడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఆదానీ బొగ్గు కంపెనీలకు లాభాలు చేకూర్చడానికే మోడీ, జగన్ ఈ భారాలు మోపుతున్నారని ప్రజలు వీటిని అర్థం చేసుకొని తిప్పి కొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు.

సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ,గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు అల్లాడి పోతుంటే ,నిత్యం ప్రజలకు అవసరమైన విద్యుత్ పై ఛార్జీలు పెంచి మరింత భారాలు వేయటం దారుణ మని అన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే భవి ష్యత్తులో మరింత ఆందోళనకు పూనుకుంటామని ఆయన హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలి



ప్రజాశక్తి - తుళ్లూరు

రోడ్డు ప్రమాదాలు - నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సిఐ ఎం శేషగిరిరావు చెప్పారు.శుక్రవారం రాత్రి స్థానిక సాయిబాబా మందిరం వద్ద ఉన్న సీతారామ షో రూం లో హీరో ఫ్యాషన్ ప్లస్ ఐ-3 స్మార్ట్ బైక్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే వారందరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,వాహనం నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు.నిర్లక్ష్యం వహించడం మంచిది కాదన్నారు. ద్విచక్ర వాహనాల కొనుగోలు దారులకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని హీరో కంపెనీ షో రూం యజమాని వాసిరెడ్డి సురేష్ కు సూచించారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహన కొనుగోలు దారులకు రోడ్డు ప్రయాణ నియమ నిబంధనలు,జాగ్రత్తలపై సిఐ అవగాహన కల్పించారు.

నేడు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న చుక్కపల్లి రమేష్, శామ్యూల్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అమరావతి ఫౌండేషన్ అండగా ఉంటుదని ప్రముఖ పారిశ్రామికవేత్త చుక్కపల్లి రమేష్ అన్నారు. రెండు దశాబ్దాల నుంచి ఈ సంస్థ పేద విద్యార్థులను అందుకుంటున్నట్లు చెప్పారు. ఈనెల 25న చంద్రమౌళీ నగర్, భాష్యం స్కూల్లో 40 మంది పేద విద్యార్థులకు రూ.2 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని బాలికల వసతి గృహంలో ఉపకార వేతనాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యు విశ్రాంత ఓఎస్‌డి శామ్యూల్ మాట్లాడుతూ అమరావతి ఫౌండేషన్ అధ్యక్షులు కొండవీటి నరసింహారావు 20 ఏళ్ల నుంచి పేద విద్యార్థులను ఆర్థికంగా ఆదుకొంటున్నట్లు చెప్పారు. కొండవీటి నరసింహారావు, ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ పెద్ది సాంబశివ రావు, ప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, శ్రీహరిరావు, కె.హనుమంతరావు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ ముప్పాళ్ళ గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కాల్వ కట్టపై మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై ఎన్ఎస్పి డిఈ రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.గత వారం రోజులుగా మట్టి తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో సమాచారం అందుకున్న ఎన్ఎస్పి అధికారులు మట్టి తవ్వకాలు జరిగే ప్రాంతానికి చేరుకొని అక్రమార్కులను హెచ్చరించారు. అయినప్పటికీ మట్టి తవ్వకాలు యథావిధిగా కొనసాగిస్తుండటంతో అక్రమార్కులపై పోలీ సులకు ఫిర్యాదు చేశారు. కాల్వకట్టల బలోపేతం కోసం ఏర్పాటు చేసిన మట్టిని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని డీఈ హెచ్చరించారు.

అంగలకుదురులో జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

పేకాడుతున్న బృందాన్ని పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. రూరల్ గ్రామం అంగలకుదురులో పేకాడుతున్న సమాచారంతో శనివారం రూరల్ ఎస్ఐ పిహెచ్ వెంకటేశ్వర్లు దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,160 నగదును స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి-తెనాలి: ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై రూరల్ పోలీసులు శని వారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగాయలంకకు చెందిన కంచె శ్రీనుబాబు(21) కొంత కాలంగా స్థానిక ఐతానగర్‌లోని పెద నాన్న ఇంటిలో ఉంటున్నాడు. ఈనెల 22న పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతనిని గుంటూరు జిల్లా వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతదేహానికి పోస్ట్ మార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో ఉన్న యువకులు అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి :

గంజాయి కలిగివున్న యువకులపై పట్టణ వన్‌టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశా రు. వారు తెలిపిన వివరాల ప్రకారం సిఐ కె.చంద్ర శేఖరరావు, ఎస్ఐ ఉమా మహేశ్వరరావు రామలింగేశ్వరపేట పాత డిపో ఆవరణలో తనిఖీలు చేశారు. అనుమానితులుగా ఉన్న నలుగురు యువ కులను సోదా చేయగా, వారి వద్ద 1250 గ్రాముల గం జాయి లభించింది. నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

బైక్ అపహరణపై కేసు నమోదు

ప్రజాశక్తి-తెనాలి:బైక్ అపహరణకు గురైన ఘటనపై ఒన్‌టౌన్ పోలీ సులు కేసు నమోదు చేవారు. వారు వెల్ల డించిన వివరాల ప్రకా రం పట్టణానికి చెందిన యువకుడు శుక్రవారం వ్యక్తి గత పనుల నిమిత్తం మార్కెట్ ప్రాం తంలోని అన్నాబత్తుని పురవేదిక వద్దకు వచ్చాడు. అక్కడ తన బైక్‌ను ఉంచి, షాపిం గ్ పూర్తి చేసుకుని తిరిగి వచ్చే సరికి బైక్ మాయమైంది. వెతికినా ఫలితం లేకపోవటంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా శనివారం కేసు నమోదు చేశారు.

మద్యం సేవిస్తున్న యువకులపై కేసు

ప్రజాశక్తి-తెనాలి:

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఐదుగురు యువకులపై రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం పెదరావూరు శివారులో ఇళ్ళ సమీ పంలో ఐదుగురు యువకులు బహిరంగంగా మద్యం సేవిస్తు న్నారు. వారిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వ హించిన ఎస్ఐ వారిపై న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు.

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి

- యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ
- 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదు
- అంగన్వాడీలపై మానసిక ఒత్తిడి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

దేశవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలకు కనీస వేతనాలు పెన్షన్ ఈఎస్ఐ అమలు చేయాలని ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలని అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని అఖిల భారత కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో వచ్చే నెల 10, 11 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద 36 గంటల పాటు జరిగే నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విస్తత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.పి మెటిల్డా దేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడీలకు తెలంగాణలో కంటే అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పి చెప్పారని 2021 తెలంగాణ రాష్ట్రం రూ, 3,500/- పెంచిన నేపథ్యంలో అదేవిధంగా రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సెంటర్ల నిర్వహణ కష్టంగా ఉందని, ఆన్‌లైన్ విధానం వచ్చాక అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదని, పెట్టుబడి పెట్టి అంగన్వాడీ సెంటర్లను నడపాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఏ మాత్రం సరిపోదని, పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వేతనాలు సకాలంలో ఇవ్వాలని, అంగన్వాడీ పిల్లలకు కూడా యూనిఫాంలో అమ్మబడి వర్తింపచేయాలన్నారు. అంగన్వాడీలు చనిపోతే మట్టి ఖర్చులు, మెడికల్ సెలవులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2022 తర్వాత విరమణ పొందిన అంగన్వాడీ వర్కర్లకు హెల్పర్స్ కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరితగతిన ఇవ్వాలన్నారు. హెల్పర్లకు పదోన్నతి విషయంలో రాజకీయ వ్యక్తులు వేధింపులు ఆపాలని, అర్హులైన అంగన్వాడీలకు పదోన్నతులు కల్పించాల్సి ఉండగా రాజకీయ వేధింపులతో వైసిపికి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే పదోన్నతులు ఇస్తున్నారని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు కెపి మెటిల్డా దేవి విమర్శించారు. అంగన్వాడీల పట్ల ముఖ్యమంత్రి చిన్న చూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 450 మంది కంటే జనాభా ఎక్కువ ఉన్న సెంటర్లను మెయిన్ సెంటర్‌గా గుర్తించాలని ఉండగా 900 దాటినా ప్రాంతాల్లో కూడా మినీ సెంటర్లు గానే కొనసాగిస్తున్నారని తక్షణమే మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. 1.2, 2.9 వర్షన్ ప్రభుత్వ రద్దు చేయాలని పెండింగ్‌లో ఉన్న బిల్లును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ సమస్యలతో అతలాకుతలం అవుతుంటే అంగన్వాడీలపై వేధింపులు తగదని అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు పోరాడి సాధించుకున్న జిఒ లను కూడా అధికారులు అమలు చేయడం లేదని విమర్శించారు. తక్షణమే అర్హులైన హెల్పర్లకు పదోన్నతి కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలలో ఉన్న ఒంటరి మహిళలకు పెన్షన్,ఇతర సౌకర్యాలు కల్పించాలని కొత్తగా విడుదల చేసిన జీవోను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఎ.ఎల్ ప్రసన్న, ఎస్.అహల్య, పద్మ, జయలక్ష్మి, ఎస్.కె సుజాత, నిర్మల, కవిత అన్ని ప్రాజెక్టుల అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు కలెక్టరేట్ ఎదుట జులై 10, 11 తేదీల్లో జరిగే 36 గంటల ధర్నాలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. శనివారం అంగన్వాడీ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు రమాసుష్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. తెలంగాణలో కంటే అదనంగా వేతనాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేతనాలు, టిఏ బిల్లులు, సెంటర్ అద్దెలు వెంటనే చెల్లించాలన్నారు. అంగన్వాడీలపై జరుగుతున్న రాజకీయ వేధింపులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. తనిఖీల పేరుతో అధికారులు, రాజకీయ నాయకులు వేధింపులకు గురి చేయటం సరికాదని హితవు పలికారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, పిల్లలకు సౌకర్యాల మెరుగు కోసం జరిగే పోరాటంలో అంగన్‌వాడీలు ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంగన్‌వాడీ బడిలో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి అమలు చేయాలని, యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ధనలక్ష్మి, రాధా, కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ, వేదికపైన వై నేతాజీ తదితరులు

పాఠశాల స్థలం ఆక్రమణను ఆపండి

ప్రజాశక్తి-బెల్లంకొండ

ఆక్రమణకు గురవుతున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కాపాడాలని కోరుతూ బెల్లంకొండ మండలంలోని కొత్తపాలెం దళితవాడ, గ్రామ పెద్దలు తహశీల్దార్ ఎస్ దుర్గేశ్వర రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శని వారం ఆయనకు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామంలో పాఠశాల ఏర్పాటు కోసం స్థలం కావాలని అధికారులు రాగా, స్థలము దొరకని నేపథ్యంలో దళితవాడ పక్కనే స్కూల్ నిర్మించేటట్లయితే ఉమ్మడి అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ఇస్తామని అంగీకారం తెలపడంతో ఆ స్థలంలో కొంత భాగంలో స్కూలు నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. అయితే, ఆ స్థలంలో తాత్కాలికంగా పశువులను కట్టడం, దిబ్బలు వేయడం చేస్తున్న కొంత మంది అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. ఆ స్థలం ఖాళీ చేయాలని పంచాయతీ వారు గతంలో నోటీసులు కూడా వారికి ఇచ్చారని, ,తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్న ఇద్దరికీ జగనన్న కాలనీలో స్థలాలు కూడా ఇచ్చారని చెప్పారు. ఆక్రమణదారుల నుండి పాఠశాల స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ స్థలం ఆక్రమణకు గురవుతుంటే అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పాఠశాల స్థలం ఆక్రమణకు గురికాకుండా ఆపాలని లేనిపక్షంలో ప్రతిఘటిస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయితి 13వ వార్డ్ మెంబర్ ఐ.శివక్రిష్ణ, ఐ.చిన్న వెంకయ్య , ఐ.తిరుపతయ్య,ఆర్.నాగమల్లేశ్వరావు,ఐ.ఏసుకుమార్, పి.రామరావు, పి. కాళేశ్వరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తహశీల్దారు దుర్గేశ్వరావుకు వినతిపత్రం ఇస్తున్న కొత్తపాలెంప్రజలు, కెవిపిఎస్ పల్నాడు జిల్లా ప్రదాన కార్యదర్శి జి.రవిబాబు



తహశీల్దార్ బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ హుస్సేన్

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల రెవిన్యూ కార్యాలయ తహశీల్దార్‌గా మహమ్మద్ హుస్సేన్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నందిగామ నుండి పదోన్నతిపై మాచర్ల తహశీల్దార్‌గా బదిలీపై వచ్చి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. తమ పరిధిలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా కలిసి పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ను రామక్రిష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, సభ్యులు రామాంజిరెడ్డి, రఘురామిరెడ్డి, లాల్‌సాహెబ్,సిహెచ్ వెంకటేశ్వరరెడ్డిలు అభినందించారు.



నోబెల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ పుస్తకాల వితరణ

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నాగార్జునసాగర్ విజయపురిసౌత్ లోని స్థానిక ఏపీ ఆర్ జూనియర్ కళాశాలకు రూ.3 లక్షల విలువైన కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు సంబంధించిన,నీట్, ఎం.సెట్, సిఏ, సిపిటి, ఐ ఐ టి, వంటి పోటీ పరీక్షల పుస్తకాలను శనివారం పవర్ మెక్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో, నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ వారు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సరోజిని కి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శ్రీకాంత్, జి రమేష్ నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించాలని విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తును చేరుకోవడానికి వారి సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రమణారెడ్డి, అధ్యాపకులు చందు ఆంజనేయులు, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఇథియోపియా డెలిగేట్స్ క్షేత్ర సందర్శన

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

మండలంలోని జూలకల్లు గ్రామంలో పల్నాడు ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల కంపెని లిమిటెడ్ ను డాక్టర్ రోజ్ ఆధ్వర్యంలో ఇథియోపియా నుంచి ఐదుగురు బృంద సభ్యులు మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ వీక్షించారు. ఈ యొక్క విజిట్ యొక్క ప్రధాన ఉద్దేశం మిరప పండించేటువంటి రైతులను కలసి వారు ఏ విధంగా వ్యవసాయం చేస్తున్నారు అని తెలుసు కోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ , ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ వారు సంయుక్తంగా ఈ మిర్చి అనే ప్రాజెక్టు గురించి వివరించారు. ఈ సందర్శనలో భాగంగా వచ్చిన అధికారులు ,డెలిగేట్ లకు హైటెక్ మిరప నర్సరీ , దాని ఉపయోగాల గురించి వివరించారు. మిర ప రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇథియోపియా డెలిగేట్స్ డాక్టర్ రోజ్, ఉద్యాన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్,వి ఎస్ ధర్మజ ,డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టి కల్చర్ జైకా, కె సాజా నాయక్, డిస్ట్రిక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ బి జే బెన్నీ, ఉద్యాన అధికారులు హాజరయ్యారు..



తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల తహశీల్దార్ కార్యాలయాన్ని శనివారం సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. స్పందన జగనన్న కు చెబుదాం కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇరుకుపాలెం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ భవానీ శంకర్,డిటి లక్ష్మీ ప్రసాద్, విఆర్వోలు పాల్గొన్నారు



పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి-యడ్లపాడు

మండలంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వంకాయలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారాజు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద ఈ వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో సత్కరించి నగదు పారితోషికం అందించారు కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి కె.సాంబశివరావు, వైసిపి నాయకులు షేక్ ఖాదర్ బాషా, బిందు సాంబశివరావు, పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఇలా.. చదువు సాగేది ఎలా..?



- తరగతి గదుల్లో సిమెంట్ కట్టలు
- ఒక వైపు ఇసుక బస్తాలు
- మరోవైపు గోరుముద్ద వంటలు
- ఒకే తరగతి గదిలో రెండు క్లాసులు
- పూర్తి కాని నాడు - నేడు పనులు



ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నాడు-నేడు పనులతో పాఠశాలలకు మహార్దశ ఏమోగాని పనులు పూర్తి కాకపోవడంతో పున: ప్రారంభమైన పాఠశాలల్లో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. అడుగు తీస్తే ఇసుక, సిమెంట్, అడుగు వేస్తే కంకర, ఇనుము తగలడంతో ఎక్కడ దెబ్బలు తాకుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న గోరుముద్ద వంటలు కూడా ఒకవైపు సిమెంట్ కట్టలు ఉంటే మధ్యలో పట్టా కట్టి చేస్తున్నారని, దీనివల్ల ఆరోగ్యకరమైన ఆహారం తయారు అవుతుందా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాంలో పూర్తి చేయాల్సిన మరమ్మతులు ఎప్పటికి అవుతాయని ప్రశ్నిస్తున్నారు.





ప్రత్తిపాడు మెయిన్ పాఠశాలలో తరగతి గదిలో సిమెంట్ బస్తాలు/ అదే గదిలో పరదా కట్టి జగనన్న గోరుముద్ద వండుతున్న ఎండిఎం

మండలంలో నాడు నేడు పేజ్ టు కింద 24 పాఠశాలలో శాంక్షన్ అవ్వగా అందులో ఐదు పాఠశాలలో జిల్లా పరిషత్ పాఠశాలలు శాంక్షన్ అయ్యాయి. వీటికి నిధులు రూ. 2 కోట్ల 25 లక్షలు శాంక్షన్అయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి నాడు నేడు పనులు పాఠశాలలో జరుగుతున్నప్పటికీ పాఠశాలలు పున ప్రారంభం అవడంతో విద్యార్థులకు నాడు నేడు పనులు ఆటంకంగా నిలిచాయి ఆ పనులకు సంబంధించి మెటీరియల్ ఇనుము ఇసుక కంకర లాంటివి పాఠశాల పరిసర ప్రాంతం అంతా ఉండటమే కాకుండా వాటి వల్ల విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తల్లిదండ్రులు కూడా పనులు జాప్యం లేకుండా ఎండాకాలంలోనే పూర్తి చేసినట్లయితే విద్యార్థులకు ఇబ్బంది ఉండేది కాదంటున్నారు.

సెకండ్ పేజ్ పనుల్లో జాప్యం

రెండవ ఫేజ్ పనులు 2022 ఏప్రిల్‌లో ప్రారంభం అయ్యాయి. అయితే ఆన్‌లైన్‌లో నగదు జమయ్యి పనులు మొదలు పెట్టేసరికి కొన్ని పాఠశాలలు జూన్, మరికొన్ని జులై, ఆగష్టు నెలల్లో కూడా పూర్తి కాలేదు. తొలివిడతగా పేరెంట్స్ కమిటీ అకౌంట్లో పడిన నగదు వరకు పనులు చేపించి పెండింగ్ పనికి నగదు జమా అవాల్సి ఉండగా ప్రభుత్వం నుంచి జాప్యం జరగడంతో నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు డబ్బులు పాఠశాల ఎకౌంటలకు పడకపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిసింది. మే నెలలో నగదు జమవటంతో ఆగిపోయిన పనిచేయడానికి భవన నిర్మాణ కార్మికులు అందుబాటులో లేకపోవడం, మరి కొన్ని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మరియు ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేకపోవడతో జాప్యం జరిగినట్లు తెలుస్తుంది. జూన్ నెలలో పాఠశాలలు పున :ప్రారంభం అవడంతో నాడు నేడు పనుల సంబంధించి మెటీరియల్ తరగతి గదులలోనే ఉండటంతో విద్యార్థులకు ఒక గదిలో రెండు తరగతిలో నిర్వహించాల్సి వస్తుందని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. నాడు నేడు పనులు రెండు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ తల్లిదండ్రులు మాత్రం మరలా జాప్యం జరిగితే ఎప్పటికీ పూర్తి అవుతాయో కూడా తెలియని పరిస్థితి ఏర్పడిందని, పాఠశాల ఆవరణలో బండలు, ఇనుపసువ్వలు, ఇటుక రాళ్లు సిమెంటు తదితర మెటీరియల్ పాఠశాల ఆవరణలో, తరగతి గదులలో ఉండటం వలన ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో అని ఆందోళన చెందుతున్నారు.



తిక్కిరెడ్డిపాలెం జడ్‌పిహెచ్ తరగతి గదిలో సిమెంట్ బస్తాలు



ప్రత్తిపాడు మండలం కేంద్రంలోని హెచ్ఇ పాఠశాలలో ఒకే తరగతి గదిలో రెండు క్లాసులు



తిక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో ఒకే తరగతి గదిలో 9,10 విద్యార్థులకు క్లాసులు

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-మంగళగిరి

సిఆర్‌డిఎ నుండి మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థలో విలీనం చేసిన 105 మంది కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని శనివారం సి ఐ టి యు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కమిషనర్ యు శారదా దేవికి వినతి పత్రం అందజేశారు. రాజధాని గ్రామాలైన ఉండవల్లి, పెనుమాక, ఎర్రబాలెం, నవులూరు, బేతపూడి, నిడమర్రు గ్రామాల్లో పనిచేస్తున్న 105 మంది పారిశుధ్య కార్మికులను ఈ సంవత్సరం మార్చి నెల నుండి ఎంటిఎంసిలో విలీనం చేశారు. నాలుగు నెలలు పూర్తయినప్పటికీ, ఇంతవరకు కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవక తీవ్రమైన ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని, పస్తులు ఉంటున్నారని, ఎర్రని ఎండల్లో సైతం వీరు పారిశుధ్య విధులు నిర్వహిస్తున్నారని విన్నవించారు. జీతాలు రాక సరైన పోషణ లేక అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. వెంటనే స్పందించి 105 మంది మున్సిపల్ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని కమిటీ అధ్యక్షులు ఎం రవి, సిఐటియు మంగళగిరి



వినతి పత్రం ఇస్తున్న ఎం రవి, కార్మికులు

పట్టణ కార్యదర్శి వై కమలాకర్, యూనియన్ నాయకులు సిహెచ్ మల్లేశ్వరి, టీ నాగమణి, ఏ మణికుమారి, ఎన్ దివ్య తదితరులు పాల్గొన్నారు. స్పందించిన కమిషనర్ రెండు రోజుల్లో జీతాలు పడతాయని తెలిపారని నాయకులు చెప్పారు.

భలే మంచి చౌకబేరం

బిల్డింగు ఉన్నా.... 30 వేలిస్తే రాజధానిలో సెంటు స్థలం

తాడేపల్లి అధికార పార్టీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగుల హల్‌చల్

ప్రజాశక్తి-తాడేపల్లి

నీకు పెద్ద బిల్డింగ్ ఉన్నా ఫర్వాలేదు... రూ.30 వేలు మా చేతిలో పెడితే రాజధానిలో ఇటీవల జగనన్న ఇచ్చిన ప్లాట్లలో సెంటు భూమి అప్పజెబుతామని అధికార పార్టీ కార్యకర్తలతో పాటు సచివాలయ సిబ్బంది తాడేపల్లిలో వసూళ్ల పర్వానికి తెరలేపారు. సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గత వారం రోజుల నుంచి ఈ వ్యవహారం నడుస్తోంది. సురక్ష పథకం కింద అర్హులైన ప్రతిఒక్క లబ్దిదారుడికి న్యాయం చేస్తామని జగన్ అంటుంటే పైసలివ్వండి అనర్హులకైనా లబ్ది చేకూరుస్తామని జగన్ తమ్ముళ్ళు, చెల్లెళ్లు, సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. డబ్బులు లేకపోతే మరొక ఆఫర్ కూడా ఇస్తున్నారు. మీరు డ్వాక్రా గ్రూపు సభ్యులైతే ప్లాటు కావాలంటే వచ్చే లోన్‌లోనే ఆ డబ్బులు కట్ చేసుకుంటామని చెబుతున్నారు. గతంలో ఇళ్లస్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రస్తుతం ఇక్కడ నివాసం ఉండటంలేదు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగం రీత్యా కుటుంబ అవసరాల రీత్యా వేరే చోటకు వెళ్లిపోయారు. అలాంటి వారి పేరు మీద ఇళ్ల పట్టాలు వచ్చాయి. గతంలో అద్దెకు ఉండి వేరే చోటకు వెళ్లిన వారి పేరు మీద వచ్చిన పట్టాలు పక్కదారి పడుతున్నాయి. సీతానగరంలోని ఓ ప్రాంతంలో అయితే ఒక్కో ఇంట్లో నలుగురికి ఇళ్లపట్టాలు వచ్చాయి. ప్రభుత్వ పింఛను పొందుతున్న వారికి కూడా స్థలాలు వచ్చాయని పట్టణంలో చర్చ నడుస్తుంది. రాజధానిలో సెంటు భూమి అనగానే సహజంగానే కొంతమందికి ఆశలు రేకెత్తాయి. అయినా మరోపక్క అనుమానం వెంటాడుతూనే ఉంది. రేపు కోర్టు తీర్పు ఎలా వస్తుంది అనే దానిపై కూడా చర్చ నడుస్తుంది. ఏదేమైనా జగనన్న ఇచ్చిన పట్టాలు తాడేపల్లి పట్టణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.



సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట..

4వ రోజుకు నికో ఆగ్రో కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- మేడికొండూరు

నికో ఆగ్రో కంపెనీ వర్కర్స్ సమస్యల పరిష్కరించాలని ఉదయం ఆరుగంటల నుండి కంపెనీ ముందు కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం 4వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్ఎం భాషా మాట్లాడుతు 26వ తేదీలోగా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. యాజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికులతో చర్చలు జరపాలన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన తర్వాత యాజమాన్య చర్యలు కక్ష సాధింపుగా ఉన్నాయన్నారు. కొద్దిమంది కార్మికులను తొలగించేందుకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్ లు పెంచాలని, కనీస సౌకర్యాలైన మంచినీరు, మరుగుదొడ్లు, క్యాంటీన్ వంటి సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక శాంతియుత వాతావరణం నెలకొనేందుకు యూనియన్ ఎల్లవేళలా సహకరిస్తుంది అన్నారు. కార్యక్రమంలో యూనియన్ సహాయకార్యదర్శులు ఆర్.శ్రీకాంత్, షేక్ మీరాసాహెబ్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి,షరీఫ్,డి.విజయ్ బాబు,రాంబాబు, శ్రీనివాస్,షేక్.బాజీ,ఆర్.రాజేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసిని నిర్వాహకులు

వడ్డేశ్వరం జడ్‌పి హైస్కూల్లో కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహా నగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మిరియాల సాంబశివరావు మాట్లాడుతూ పది, ఇంటర్ చదివేటప్పుడే విద్యార్థులు భవిష్యత్తు నిర్దేశించుకోవాలన్నారు. అనంతరం 2022- 23 సంవత్సరం 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు పాఠశాల గణితం ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప తన తల్లి కాకుమాను కిరీటమ్మ 94 వ జయంతి సందర్భంగా అమ్మ అవార్డ్స్ ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. తాడేపల్లి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన ఎ ఉదయ నాగలక్ష్మికి ప్రథమ బహుమతిగా రూ.2వేలు, జాహ్నవి, కోమలికి రూ.వెయ్యిచొప్పున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కే కాంతారావు, టి శ్రీనివాసరావు, బుజ్జి బాబు, డివి రమణమ్మ, రామచంద్ర రావు, ఎస్వీఎన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్షాన్ని వడిసి పట్టండి

పేరేచర్ల ఇంటిల్ పబ్లిక్ స్కూల్లో క్యాచ్ ద రెయిన్‌పై అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని పేర్లేచర్ల పబ్లిక్ స్కూల్లో శనివారం నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ అధ్వర్యంలో క్యాచ్ ద రెయిన్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. జానపద కళాకారులు పాటల రూపంలో పిల్లలకు ప్లాస్టిక్ బ్యాగ్ నిషేధం, ఇంకుడు గుంతలు ప్రయోజనం తదితర అంశాలు వివరించారు. అనంతరం పలు రకాల మొక్కలు నాటారు. విద్యార్థుల చేత మొక్కల పెంపకం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయు రాలు సుకన్య, గ్రంథాలయ ఇన్చార్జి కోనూరి తేజ బాబు, పి ఈ టి షేక్ రన్ను హుస్సేన్ పాల్గొన్నారు.



రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండలంలో పలు అభివద్ధి పనులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శ్రీకారం చుట్టారు. మండలంలోని ఎనికేపాడు గ్రామంలో రూ.20 లక్షలతో గ్రావెల్ రోడ్డు, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు , రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

పట్టణంలోని 26,27,28 వ వార్డులలో రూ 60 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించనున్న రూపాయల వ్యయంతో 26, 27, 28వ వార్డులలో సీ.సీ రోడ్డు, సైడ్ డ్రైనేజీలు, వాటర్ లైన్, బోరింగ్లు, ఐమాక్స్ లైటింగ్, కల్వర్టుల పనులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అవసరమైన అన్ని వసతులను కల్పించడమే వైసిపి లక్ష్యమన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో అభివద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని సిసి రోడ్లు, డ్రైనేజీలను ప్రాధాన్యత క్రమంలో నిర్మిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమ స్యలను తెలుసుకొని పరిష్కరించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.



అమరావతి మండలంలోని ఎనికేపాడులో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఎమ్మెల్యే శంకరరావు తదితరులు



జలకళ పథకం పత్రాలు అందజేత

ప్రజాశక్తి-మాచర్ల

మండల పరిధిలో అర్హులైన రైతులకు స్థానిక ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి జలకళ పథకం ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి మాటాడుతూ పేద రైతులు తమ పొలాలను సాగు చేసుకునేందుకు అవసరమైన సాగు నీరు అందించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ జలకళ పథకాన్ని ప్రవేశపెట్టి ఆదుకుంటుందన్నారు. మండల పరిధిలోని హసనాబాద్ తండాకు చెందిన 24, అలుగురాజుపల్లికి చెందిన 6గురి తగిన ధృవీకరణ పత్రాలను రామక్రిష్ణారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి. శ్రీనివాసరావు, లబ్దిదారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కార్యకర్తలకు అండగా ఉంటామని పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం హసనాబాద్ తండాకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీని వీడి వైసిపి పార్టీలో చేరారు. వీరిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీలో చేరిన కేతవత్ రాఖా నాయక్, కసంజి, బాల, సరితానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిసిఆర్సి కార్డులు పొందాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మండల పరిషత్తు కార్యాలయంలో డిబిఆర్‌సి ఆధ్వర్యంలో కౌలు రైతుల ప్రచార ఉద్యమ కరపత్రాలను శనివారం ఎంపిడిఓ పుట్టారెడ్డి,అగ్రికల్చర్ ఏవో అరుణ, ఏపివో రామారావు,డిటి ప్రసాద్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఏవో అరుణ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ కౌలు రైతులు సిసిఆర్సి కార్డులు పొందటం ద్వారా రైతు భరోసా కేంద్రాల నుంచి ఇన్ పుట్ సబ్సిడీ విత్తనాలు,ఎరువులు,బ్యాంక్ రుణాలు కూడా పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. కౌలు రైతులు వేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిబిఆర్సి ఏరియా కోఆర్డినేటర్ మే డే వెంకటరమణ , వీఆర్వోలు హరిప్రసాద్,సంజీవరావు,మస్తాన్ ,మాబువలి, అగ్రికల్చర్ అసిస్టెంట్ శైలజ,డిబిఆర్సి ప్రతినిధులు మన్నం కోటేశ్వరరావు,నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

'బస్సు యాత్రను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గ పరిధిలో ఈ నెల 27 న మాచర్ల టీడీపీ ఇన్చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్న భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నేతలు శనివారం విజయపురి సౌత్ లో పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ విలేకరులతో మాట్లాడారు.ఈ నెల 27 న కారంపూడి మండలం పేసన్ని గంట్లలో ప్రారంభమై మాచర్ల పట్టణం లోకి బస్సు యాత్ర చేరుతుందని తెలిపారు.

30న అచ్చంపేట మండలానికి బస్సుయాత్ర

ప్రజాశక్తి -అచ్చంపేట

ఈ నెల 30వ తేదీన అచ్చంపేట మండలానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు చేపడుతున్న బస్సు యాత్ర అచ్చంపేట మండలానికి చేరుతుందని మండల టిడిపి అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు శనివారం ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

'నెలనెలా సాహిత్య మేళా'

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా కరస్పాండెంట్

పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆధ్వర్యంలో నిర్వహించిన నెల నెలా సాహిత్య మేళాలో భాగంగా పట్టణంలోని భువన చంద్ర టౌన్ హాల్ లో శనివారం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరయ్యారు.తొలుత శ్రీశ్రీ రచించిన గీతాలను ఆహ్లాద కరమైనరీతిలో పలువురు గాయకులు ఆలపించారు. తెలుగు భాషా, సాహిత్య సమాలోచన కార్యక్రమంలో భాగంగా ఆధునిక సమాజంపై శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన ప్రభావం అనే అంశంపై ఉద్వేగ భరితంగా ప్రసంగాలు అతిథులు చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆధునిక సమాజం పై శ్రీశ్రీ మహా ప్రస్థానం ప్రభావం అనే అంశం, సాహిత్య సమాలోచన ద్వారా తెలుగు భాషా అభివృద్ధిపై పెను గొండ లక్ష్మీనారాయణ లు ప్రసంగం చాలా గొప్పగా ఉంటాయన్నారు. చిన్నతనం నుంచే తానూ శ్రీశ్రీ రచనలు, సినీ గేయ రచయితలు, మాటల మాంత్రికుడు గా భావిం చి ఇష్టపడేవాడినన్నారు. సమాజం తీరు పట్ల అవగాహన కలిగి శ్రీశ్రీ అధ్భుతమైన రీతిలో తెలుగు సాహిత్యాన్ని తీసుకు వచ్చి రచనలు చేసి గొప్పతనాన్ని చాటి చెప్పారని కొనియాడారు.

'ఆధునిక సమాజంపై శ్రీశ్రీ మహా ప్రస్థానం ప్రభావం 'అనే అంశంపై ప్రధాన వక్త పెనుగొండ లక్ష్మీనారాయణ సాహిత్య ప్రసంగం చేశారు.మహా ప్రస్థానంలో సామాజిక రుగ్మతలను నివారించడం, సమ సమాజ స్థాపనకు చేసిన కృషిని కొనియాడారు.మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ శ్రీ శ్రీ రచనలు అంటే చాలా ఇష్టమని అన్నారు.

ఆయన రచనల్లో సమ సమాజ స్థాపనకు,మానవ సంబంధాలకు దగ్గరగా ఉంటాయని, మనిషి అంతరంగ లోతులను తెలిసేలా ఉంటాయని అన్నారు. శ్రీశ్రీ, గుర్రం జాషువా లు ఒకే మనస్తత్వం కలి గిన వారని, మహాత్మా గాంధీ, డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సమకాలికులనే కానీ విభిన్న భావాలను కలిగి సమాజ ప్రగతికి కృషి చేశారని కొనియాడారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ నెల నెలా సాహిత్య మేళ కార్యక్రమం పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం సంతోష దాయకమన్నారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు ప్రసంగించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్. పక్కన మంత్రి రాంబాబు,కళావేదిక అధ్యక్షులు పొన్నపాటి తదితరులు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అమరావతి

మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసి రావాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. అమరావతి మండలం పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శంకర్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మండలంలో జరగాల్సిన అభివద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ,అమరావతి మండలంలో గత పాలకులు చేయని ఎన్నో అబివృద్ధి కార్యక్రమాలు ఈ నాలుగేళ్లలో చేశామన్నారు. అమరావతి - బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. అమరావతి నుంచి తుళ్ళూరుకు రోడ్డుతో పాటు పెదమద్దూరు బ్రిడ్జి కూడా నిర్మిస్తున్నామన్నారు. అమరావతి మండలాన్ని మరింత అభివృద్ధి మార్గంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అమరావతి మండలం నెమలికల్లు లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు కి గ్రామస్థులు, మహిళలు పూలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నెమలికల్లులో షాదీతోఫా కింద మంజూరైన చెక్కును లబ్ది దారులకు ఎమ్మెల్యే శంకరరావు అందించారు. గ్రామానికి చెందిన షేక్ రసూల్ కుమార్తెజాన్ బీకి ఇటీవల వివాహం జరిగింది. వారు షాదీతోఫా పథకానికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రమాదవశాత్తు గాయపడి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 30వ వారుక్కు చెందిన రషీద్‌న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శించారు. అనంతరం రషీద్‌కు ఆర్థికసాయం అందజేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10,000 అందించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు షేక్ అబ్దుల్ ఖుమీర్, షేక్ అబ్దుల్ ఖాదర్, షేక్ గౌస్ బాషా, షేక్ మబ్బుల్, షేక్ ఖాజా, షేక్ హసన్ అలీ, షేక్ యాసిన్, షేక్ హబీబుల్లా, దేవిశెట్టి అయ్యప్ప, షేక్ బాషా పాల్గొన్నారు.

మేనిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్ర బాబు నాయుడు ఇటీవల ప్రకటించిన మేనిఫెస్టో గురించి టిడిపి శనివారం ప్రచారం నిర్వ హించింది. స్థానిక చౌత్రా సెంటర్, గబ్బిటివారి వీధి, ఆంజ నేయ స్వామి గుడి బజారులో కౌన్సిలర్ కూనల ప్రమీల ప్రచారం చేశారు.



సమస్యల పరిష్కారం కోసమే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజల సమస్యలను పూర్తిగా పరిష్కారం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, మున్సిపల్ కమీషనర్ ఇవి రమణబాబులు స్పష్టం చేశారు. స్థానిక నెహ్రునగర్‌లోని 1వ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, మున్సిపల్ కమీషనర్ ఇవి రమణబాబులు మాట్లాడారు. మండల పరిధిలో కంభంపాడు గ్రామం యందలి సచివాలయం పరిధిలో ఎం.పి.డి.ఓ కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు తదితరులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామాంజిరెడ్డి, గట్ల అరుణకుమారి కోటిరెడ్డి, అల్లీ జీవన్, రామిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు జలాల్‌పురంలో జగనన్న సురక్ష పథకం పేరుతో అధికారులు ఇంటింటికి తిరిగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ క్షమారాణి, ఎండిఒ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యడ్లపాడు

మండలం లోని కారుచొల గ్రామ సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వే క్షేత్ర స్థాయి పరిశీలనలో ఎంపిడిఒ, ,తహశీల్దార్, విస్తరణాధికారి పాల్గొన్నారు. సర్వే చేయు విధానంపై గ్రామ వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ముస్లిం మత పెద్దలతో సమీక్ష

ప్రజాశక్తి-మాచర్ల టౌన్

ఈనెల 29న జరగనున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని సీఐ టి. బాలకష్ణ పట్టణంలోని ముస్లిం మత పెద్దలతో శనివారం సర్కిల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బాలకష్ణ మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా ముస్లిం సోదరులు జరుపుకోనున్న బక్రీద్ పండుగ నాడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేయమన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా మత విద్వేషాలకు పాల్పడేలా వ్యవహరిస్తే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై అరుణ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్త- విజయపురిసౌత్

స్థానిక శ్రీ సీతారామాలయంలో శనివారం మట్టపల్లి బ్రహ్మాం,బాలమ్మ దంపతుల ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ప్రతి శనివారం పేదలకు అన్నదాన నిర్వహణ లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

రాజధాని అసైన్డ్ రైతుల కౌలు చెల్లించాలి

తుళ్లూరులో సిపిఎం ఆధ్వర్యంలో అసైన్డ్ రైతుల నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ రైతుల కుటుంబ జీవనం అగమ్య గోచరంగా మారిందని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి ఆందోళన వ్యక్తం చేశారు. అసైన్డ్ రైతుల్లో అత్యధికులు దళితులు, ఇతర పేద వర్గాలకు చెందినవారని, వ్యవసాయ పనులు లేక, రాజధాని నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో వారి కుటుంబ జీవనం ఇబ్బంది కరంగా మారిందన్నారు. విచారణ పేరుతో రెండేళ్లుగా ప్రభుత్వం కౌలు కూడా చెల్లించక పోవడం వారిని వేదనకు గురి చేస్తోందని, కౌలు చెల్లింపులో అధికారులు,ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ, తక్షణం వారికి కౌలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బాలయేసు కాలనీలో అసైన్డ్ రైతులు నిరసన తెలిపారు .ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ,అసైన్డ్ రైతులకు పెండింగ్ ఉన్న రెండు సంవత్సరాల కౌలు వెంటనే చెల్లించకపోతే 'ఛలో విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయం' చేపడతామన్నారు. రాజధానిలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం కౌలు కూడా చెల్లించకపోతే దళితులు, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతుల కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని నిలదీశారు. మెట్ట భూములతో సమాన ప్యాకేజీ ఇస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయో ప్రభుత్వం చెప్పాలన్నారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా అసైన్డ్ రైతులకు సమాన ప్యాకేజీ ఎందుకు ఇవ్వలేకపోయారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే రానున్న ఎన్నికల్లో అసైన్డ్ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సి ఆర్ డి ఎ అధికారులు అసైన్డ్ రైతులపై కక్ష సాధింపుచర్యలు మానుకొని రాజధానిలోని 3 వేల మంది అసైన్డ్ రైతులకు వెంటనే కౌలు చెల్లించాలని, ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా సమాన ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విజయవాడ సి ఆర్ డి ఎ కార్యాలయం ఎదుట అసైన్డ్ రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



తుళ్లూరులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, అసైన్డ రైతులు

బోసుబొమ్మ సెంటర్‌లో ఉద్రిక్తత

మొన్న గోడ కట్టారు... నేడు పగులగొట్టారు

ప్రజాశక్తి-తాడేపల్లి

శనివారం రాత్రి తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లోని గంగానమ్మ గుడి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మున్సిపల్ అధికారుల తీరు దీనికి కారణంగా కనబడుతోంది. బోసు బొమ్మ సెంటర్‌లో 70 ఏళ్ల క్రితమే గంగానమ్మ గుడి నిర్మితమై ఉంది. గుడి పక్కనే రహీంఖాన్‌కు చెందిన సుమారు ఐదు సెంట్ల స్థలం ఉంది. ఈ ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి నాలుగడుగుల దారి ఇంటి స్థలం మధ్యలోంచి ఇళ్ల మధ్య ఉంది. సుమారు రెండు సంవత్సరాల క్రితం పాత దారిని వదిలేసి గంగానమ్మ గుడి పక్కగా దారి తీయడానికి అక్కడున్న ప్రహరీ గోడను రహీంఖాన్ మనుషులు పగులగొట్టారు. దీంతో గుడి నిర్వాహకులు అడ్డుతగిలారు. కూల్చివేత పనులు అప్పట్లో ఆగిపోయాయి. దీనిపై రహీంఖాన్ కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. స్టే గుడి స్థలానికి సంబంధించిన గోడ మీద కాకుండా వ్యక్తుల మీద తీసుకొచ్చారు. అప్పటి నుంచి వివాదం నడుస్తుంది. ఇటీవల గుడి నిర్వాహకులు స్థానిక ఎమ్మెల్యేను కలిశారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆ స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని, సిమెంటు రోడ్లు వేస్తామని, పడగొట్టిన గోడ స్థానంలో ప్రహరీగోడ నిర్మిస్తామని హామీనిచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ అధికారులు వచ్చి గుడి చుట్టూ రోడ్డు వేయడంతో పాటు ప్రహరీ కూడా నిర్మించారు. శనివారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో 17వ వార్డు సచివాలయ సెక్రటరీ శ్యామ్ తన సిబ్బందితో వచ్చి గోడ కూల్చే పనులను చేపట్టారు. విషయం స్థానికులకు తెలియడంతో పెద్దఎత్తున అక్కడ పోగయ్యారు. గోడ కూల్చే పనులను అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

డిసిపి, ఎసిపి పగలగొట్టమంటేనే వచ్చాం

సచివాలయ సెక్రటరీ శ్యామ్

గోడ కూల్చివేత దగ్గర ఉన్న 17వ వార్డు సచివాలయ సెక్రటరీ శ్యామ్‌ను ప్రజాశక్తి వివరణ కోరింది. డిసిపి, ఎసిపి మాపై ఉన్నతాధికారులు గోడ పగలగొట్టమంటే వచ్చామని చెప్పారు. గతంలో జరిగిన సంఘటనలను స్థానికులు వివరించగా అది తమకు తెలియదన్నారు. వారినే అడిగి వివరాలు తెలుసుకోవాలని చెప్పారు.

30న విజయవాడలో మహాధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడికొండ : విజయవాడలో ఈనెల 30న జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ కోరారు. శనివారం తాడికొండ గ్రామంలోని సాయిబాబా గుడిలో ఏర్పాటు చేసిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది రైతులకు చేదు అనుభవాలు మిగిలాయని, అధిక వర్షాలు అకాల వర్షాల వలన రైతంగం తీవ్రంగా నష్టపోయింది అన్నారు. రైతు సమస్యలు-అవగాహన మరియు సమస్యలు పరిష్కారం దిశగా ఆలోచన చేయడం ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ే2022 సంవత్సరంలో పంట నష్టపోయిన రైతు రథులకు ఇన్పుట్ సబ్సిడీ పంట భీమా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాల నుండి 0 వడ్డీ పథకం పావలా వడ్డీ పథకాలకు ఇవ్వాల్సిన నిధులను వెంటనే మంజూరు చేయాలన్నారు. పాడి రైతులకు నాలుగు రూపాయలు బోనస్ ఇస్తానని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ఇప్పటివరకు అమలుపరచలేదని అన్నారు బోనస్ విడుదల చేసి పాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలపై నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కనగాల పూర్ణచంద్రరావు, ఇమ్మడి రామారావు, చింతల భాస్కరరావు బాణావత్ భద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజశక్తి-గుంటూరు లీగల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యాచట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సు న్యాయసేవాధికార సంస్థ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.చంద్రమౌళేశ్వరి పాల్గొని విద్యాహక్కు చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, పిల్లలకు సంబంధించిన ఇతర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ జి.ప్రమీల, లీగల్ కమ్ ప్రొబేషనర్ ఆఫీసర్ బి.వాసంతి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సిహెచ్.విజయ్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టి.ఎ.శేఖర్, డిఎల్‌పిఒ ఎస్.శ్రీనివాసరెడ్డి, ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు పాల్గొని, క్షేత్ర స్థాయిలో వారి అనుభవా లను వివ రించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ ప్యానల్ న్యాయ వాదులు పాల్గొన్నారు.



ఐఎంఎ మహిళా విభాగం విస్తృత సేవలు

మీడియా సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర నాయకులు

నేడు హాయ్‌ల్యాండ్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు, సాంస్కృతిక కార్యక్రమాలు


ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఆంధ్రప్రదేశ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐఎంఎ శాఖలలో మహిళా విభాగాల ద్వారా ప్రజలకు ముఖ్యంగా మహిళలకు, బాలికలకు చేస్తున్న ఆరోగ్య సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు మరింత విస్తృతం చేయనున్నట్లు ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర ఐఎంఎ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ హేమలత, మిషన్ పింక్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ దుర్గా రాణి, సదస్సు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఆళ్ళ ప్రశాంతి శనివారం హాయ్ లాండ్ రిసార్ట్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ప్రకటించారు. చినకాకాని సమీపంలోని హాయ్ ల్యాండ్ రిసార్ట్ లో శని, ఆదివారాలలో ఐఎంఎ రాష్ట్రస్థాయి మహిళల సాంస్కృతిక, వైద్య సదస్సులు, విజయవాడ, గుంటూరు ఐఎంఎ మహిళా విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ ప్రధాన సంఘంలో మహిళా నాయకత్వం పెంపొందించే లక్ష్యంతో అనుబంధ మహిళ విభాగాలను ప్రోత్సహించడం, సంఘం కార్యక్రమాల నిర్వహణలో వారికి కీలక బాధ్యతలు అప్పగించడం చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ హేమలత, మిషన్ పింక్ హెల్త్ చైర్ పర్సన్, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ దుర్గారాణి మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలలో బాలికలకు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడం, వారిలో ఉన్న రక్తహీనత తదితర సమస్యలు గుర్తించి సరైన పోషకాహారం, అవసరమైన పరీక్షలు చేసి, మందులు అందజేసి కౌమార బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టామని, వాటిని మరింత విస్తృతం చేస్తామని అన్నారు. మహిళా సాధికారిత కోసం నాయకత్వ శిక్షణా కార్యక్రమాలు, పట్టణ గ్రామీణ పేద మహిళల ఆరోగ్య రక్షణ కోసం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు, ప్రత్యేక మహిళా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనస్థీషియా వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ ఆళ్ల ప్రశాంతి మాట్లాడుతూ నిరంతరం వత్తిలో ఉన్న మహిళా వైద్యులకు మానసిక, శారీరక ఉపశమనం కలిగించడం కోసం మహిళా వైద్యుల సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం నిర్వహిస్తున్నామని, ఆదివారం ప్రత్యేకంగా మహిళా వైద్యుల ప్రసంగాలతో కూడిన నిరంతర వైద్య విద్యా వైజ్ఞానిక సదస్సు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి మహిళా వైద్యులు వచ్చి పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వసుధ, కోశాధికారి ప్రత్యూష, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ సుప్రజ, డాక్టర్ సి హెచ్.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

నెక్కల్లులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని నెక్కల్లు గ్రామంలో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను 99శాతం నెరవేర్చారని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయంలో ఒక్క సంక్షేమ పథకం సక్రమంగా అమలు కాలేదన్నారు. గతంలో పని కావాలంటే ప్రభుత్వ కార్యాలయం చుట్టూ కాళ్ల అరిగేలా తిరిగే పరిస్థితి ఉండేదని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


నెక్కల్లులో కత్తెర సురేష్ కుమార్ ప్రచారం



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పాత మంగళగిరి జి ఆర్ స్కూల్ లో చదువుకుంటున్న వంద మంది పిల్లలకు పాత మంగళగిరి వాస్తవ్యులు రామకృష్ణ సహకారంతో నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీయర్ స్కూల్ సిబ్బంది విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు ఆలా శివాజీ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడికి ట్రైసైకిల్ అందజేసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో పక్షవాతం కారణంగా నడవలేని వృద్ధుడు నూకల వెంకటేశ్వరరావుకు శనివారం టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు ట్రైసైకిలు అందజేశారు. గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్న తనకు ట్రై సైకిల్ కావాలని అర్జీ రూపంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు విన్నవించుకున్నానని, స్పందించి ట్రై సైకిల్ అందజేసిన నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బిరుదు గడ్డ రమేష్, గ్రామ రైతు నాయకులు శేషం శెట్టి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల నాయకులు మారుమాక అబ్రహం, కోలాంటి మాణిక్యరావు పాల్గొన్నారు.

కూరగాయలు వితరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని విజయవాడ క్లబ్ దగ్గర ఆర్‌ఎల్‌ఎస్ గౌతమి రివర్ బ్రిడ్జి అపార్టుమెంట్ నుంచి టిటిడి నిత్యాన్నదాన పథకానికి పది టన్నుల కూరగాయలను శనివారం ఉచితంగా లారీలో పంపించారు. ఈ కార్యక్రమాన్ని ఎబిసి స్కానింగ్ అధినేత తుమ్మల రాజేశ్వరరావు, నూతక్కి రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. అ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండవ కుటుంబరావు భార్య సత్యశ్రీ, కుమార్తెలు రిషిత, సంహిత మరియు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎ.సత్యనారాయణ, బి.దుర్గాప్రసాద్, ఉయ్యాల కోటేశ్వరరావు, రామ్మోహనరావు, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పవర్ లిఫ్టర్లకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - మంగళగిరి



ఈనెల 23వ తేదీ నుండి 25వ తేదీ వరకు నెల్లూరు పట్టణంలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళల పవర్ లిఫ్టింగ్, బెంజ్ ప్రెస్ పోటీలో జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న నలుగురు పవర్ లిఫ్టర్లు మూడు బంగారు, ఒక సిల్వర్ పతకాలు సాధించినట్లుగా కోచ్ షేక్ సంధాని శనివారం తెలిపారు. ఎస్.కె రుక్సాన 57 కేజీలు విభాగంలో బంగారు పతకం, ఎస్.కె సబీనా 84 కేజీల విభాగంలో బంగారు పతకం, బి చంద్రిక ప్లస్ 84 కేజీలు విభాగంలో బంగారు పతకం, బెంజ్ ప్రెస్‌లో బంగారు పతకం, జి రేవతి 76 కేజీల భాగంలో సిల్వర్ పథకం, బెంజ్ ప్రెస్‌లో సిల్వర్ పతకం సాధించినట్లుగా తెలిపారు. లిఫ్టర్లను రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి ఎస్ సూర్యనారాయణ, జి కోటేశ్వరావు, ఎస్ కోటేశ్వరావు, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి బాల ప్రసాద్, కే విజయ్ కుమార్ అభినందించినట్లుగా తెలిపారు.


హాజరైన పూర్వ విద్యార్థులు, అతిధులు

పూర్వ విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశంలో రెక్టార్ డాక్టర్ పి వరప్రసాద్



మాట్లాడుతున్న రెక్టార్ వరప్రసాద్

ప్రజాశక్తి-ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతున్నదని, వర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు భాగస్వాములవ్వాలని రెక్టార్ ఆచార్య డాక్టర్ పి వరప్రసాదమూర్తి కోరారు. శనివారం నాగార్జునా వర్సిటీలో ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్వవిద్యాలయ 47 ఏళ్ల ప్రస్థానంలో దినదినాభివద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థినీ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా నిత్య నూతనంగా సమాజానికి అవసరమైన అనేక రంగాలకు చెందిన పాఠ్యాంశాలను విద్యా విషయక బోధనాంశాలుగా చేర్చి అనేక కోర్సులను విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. నాగార్జున విశ్వవిద్యాలయం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును పొందుతున్నదని, జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ స్థాయిలలో తన కీర్తి ప్రతిష్టలను సువర్ణాక్షరాలతో ఇనుమడింప చేసుకుంటున్నదన్నారు. వర్సిటీ లో దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఫిలిమ్ మేకింగ్, ఎమ్.ఎ.మ్యూజిక్, ఎమ్.ఎ. డాన్స్, ఎమ్ బిఎ మీడియా మేనేజ్ మెంట్, ఎమ్ ఎస్ సి ఫారెస్ట్రీ , వంటి ఎన్నో నూతన కోర్సులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు ' విద్యార్థిగా ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి' చేరుకోవాలని జీవితంలో ఎన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ బి.కరుణ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా విశ్వవిద్యాలయం శాఖోప శాఖలుగా విస్తరించి అనేక విభాగాలుగా ఎన్నో రంగాలలో విద్యా కోర్సులను అందిస్తున్నదని తెలిపారు. విశ్వవిద్యాలయంలో చదువుకున్న విద్యార్థులు ప్రపంచం నలుమూలలా ఎంతో మంచి స్థానాలలో, ఉన్నత పదవులలో, విద్యావేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఉన్నారని అభినందించారు. విశ్వవిద్యాలయం విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలతో విద్యా ప్రమాణాలతో అభివృద్ధి దిశగా ప్రగతి పథంలో సాగుతున్నదని వివరించారు. ఆర్ట్స్ కళాశాల ఆచార్యులు పీహెచ్ స్వరూపారాణి మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాల ప్రగతిని వివరించారు. సమావేశంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు ఆచార్య డాక్టర్ జి వి ఎస్ ఆర్. ఆంజనేయులు అధ్యక్షత వహించారు. సమావేశంలో దూర విద్యా కేంద్ర సంచాలకులు ఆచార్య డాక్టర్ బి.నాగరాజు, సి డి సి డీన్ ఆచార్య డాక్టర్ కె. మధు బాబు, ఆచార్య డాక్టర్ ఆర్.శివరామ్ ప్రసాద్, డి ఎ అర్ సుబ్రమణ్యం, ప్రముఖ న్యాయవాది నర్రా శ్రీనివాసరావు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

కిట్స్‌లో అధ్యాపకుల సాధికారతపై ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-గుంటూరు



కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో నూతన విద్యా విధానం సాధికారిత అనే అంశంపై ఆర్టిఫిషియల్ అండ్ ఇంటలిజెన్స్ వారి ఆధ్వర్యంలో అధ్యాపకులకు మూడురోజుల ఎఫ్‌డిపి (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పి.ప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులకు రీసెర్చ్ చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ వారి విభాగాల్లో రీసెర్చ్ చేయాలని సూచించారు. విద్యార్థి కేంద్రీకృత బోధన, అభ్యాస పద్దతి, దీనిలో పేర్కొన్న లక్ష్యాలు, ఫలితాలను సాధించడానికి కోర్సు డెలివరీ, మూల్యాంకనం ప్రణాళిక చేయటం గురించి వివరించారు. కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ అధ్యాపకులు వారి నైపుణ్యాలను వాస్తవ ప్రపంచానికి అందించటానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. అధ్యాపకులు ఇలాంటి కార్యక్రమాలను ఉపయోగించుకొని నాణ్యమైన విద్యను అందించవచ్చని కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, సిఎఐ విభాగాధిపతి డాక్టర్ జి.మురళీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారిణి

ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కూడా తరచుగా పర్యవేక్షించాల్సిందే

ప్రజాశక్తి-తెనాలి


ఎన్‌సిఆర్‌ఎం హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద రుచిచూస్తున్న డీఈవో

పట్టణంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాధికారిణి పి.శైలజ శనివారం తనిఖీ చేశారు. పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం పట్టణంలో పర్యటించి పలు పాఠశాలలను పరిశీలించి జెవికె కిట్లు, అధికారుల పనితీరు, ఉపాధ్యాయుల పర్యవేక్షణపై కొంత అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఎంఈవో, డిఈవో పాఠశాలలకు సంబంధించి శుక్రవారం ఎన్నిసార్లు యాప్ పరిశీలించారన్న వివరాలను తనిఖీలో సమయంలో సంబంధిత అధికారులను ఆయన కోరారు కూడా. పాఠశాలల్లో అమలౌతున్న సంక్షేమ పథకాలపై ఉపాధ్యాయులు, అధికారులకు నిరంతర పర్యవేక్షణ అవసరవమని హెచ్చరించిన నేపథ్యంలో డీఈవో మారీసుపేటలోని ఎన్‌సిఆర్‌ఎం హైస్కూల్‌ను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థులకు అందించే భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. అలాగే స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి హైస్కూల్‌ను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సచివాలయాల్లో పనిచేస్తున్న ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కూడా భాగస్వాములను చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో, వారి నిరంతర పర్యవేక్షణ కూడా పాఠశాలలపై ఉంటుందన్నారు. పాఠశాలల్లో అమలయ్యే జగనన్న గోరుముద్ద, జెవికె కిట్లపంపిణీ, నాడు నేడు కార్యక్రమాలను విద్యాశాఖ అధికారులతో పాటు ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వారంలో రెండు రోజులు పర్యవేక్షిస్తారన్నారు. ఆమె వెంట మండలవిద్యాధికారులు మేకల లక్ష్మినారాయణ, జయంతిబాబు, జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్ జాలాది రవి, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉధృతమవుతున్న ఆందోళనలు

7 వీక్షణం

ఉమ్మడి జిల్లాలో ప్రజా సమస్యలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఎన్నికల ఏడాది ప్రారంభం కావడంతో టిడిపి, వైసిపి నేతలు ప్రజల్లోకి వెళ్లేందుకు విభిన్న పద్ధతులను ఎంచుకుంటున్నారు. ఇతర పార్టీలు ప్రజా సమస్యలపై పోరుబాట పట్టాయి. ప్రధానంగా వామపక్షాలు మాత్రం వివిధ అంశాలపై నిత్యం జిల్లాలో వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా విద్యుత్ ఛార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచడంపై వామపక్షాలు ఆందోళనలను ఉధృతం చేస్తున్నాయి. ప్రజలపై విద్యుత్ శాఖ విధిస్తున్న అదనపు ఛార్జీలపై సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు పోరుబాట పట్టాయి. ఈనెల 17న గుంటూరులో వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన విద్యుత్ కార్యాలయాలను ముట్టడించాలని నిర్ణయించారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఎం సిపిఐ, ఐఎఫ్ టి యు తదితర పార్టీలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం అయ్యాయి. విద్యుత్ ఛార్జీల విషయంలో ప్రభుత్వం అవలంభిస్తున్న ఏకపక్ష వైఖరి వల్ల వైసిపి నాయకుల్లోనే అయోమయం ఏర్పడింది. ఎడం చేత్తో సంక్షేమ పథకాల సొమ్ము ఇస్తూనే కుడిచేత్తో వివిధ రూపాల్లో ప్రజలపై భారం మోపుతున్నారన్న భావన ప్రజల్లోకి వెళ్తోందని వైసిపి నాయకులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా విద్యుత్ ఛార్జీల అంశం ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎడాపెడా అదనపు భారం మోపుతుండటంపై ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతోంది. అలాగే చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ సోమవారం డిసిసిబి ఉద్యోగులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. సహకార సంఘాల్లో రైతులు మాత్రమే భాగస్వాములుగా ఉండాల్సి ఉండగా 50 శాతం మంది ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలకు భాగస్వామ్యం కల్పించడంపై ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అదే విధంగా టిడిపి,కాంగ్రెస్ పార్టీలు కూడా విద్యుత్ కోతలు, ఛార్జీల పెంపుపై ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ టిడిపి విడుదల చేసిన మినీ మేనిఫెస్టోపై కూడా ఆపార్టీ నాయకులు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారు. మూడేళ్లపాటు ప్రజలకు దూరంగా ఉన్న టిడిపి సీనియర్ నాయకులంతా ఇప్పుడు క్రమంగా ప్రజల్లోకి వస్తున్నారు.టిడిపి నిర్వహించే ఆందోళనల్లో పాల్గొంటున్నారు.మొత్తంగా ప్రజా సమస్యలు, వివిధ అంశాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను నిరోధించేందుకు జగనన్న సురక్ష పేరుతో ప్రజల్లోకి వెళ్లాలని అధికార పార్టీ నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి గతంలో నిలిపివేసిన బియ్యం కార్డులు,వివిధ సంక్షేమ పథకాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమం శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభం అయింది. నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలకు 11 రకాల సేవలను అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే విద్యుత్ ఛార్జీల పెంపుపై గ్రామాలకు వచ్చిన అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీసే అవకాశం లేకపోలేదు.

(ఎవిడి శర్మ)

ఘనంగా కెఎల్‌పి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు



స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పాఠశాల వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కలలు కంటూ నిద్రపోకూడదని, మేల్కొని కలలను సాకారం చేసుకోవాలని అన్నారు.నాగార్జునా ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సివిల్స్‌లో 60వ ర్యాంకు సాధించిన కెఎల్‌పి పూర్వ విద్యార్థి ప్రణవ్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె.బసవపున్నయ్య మాట్లాడారు. సివిల్స్ ర్యాంకర్ సి.ప్రణవ్ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా శ్రవణ నైపుణ్యాన్ని సాధించాలని, వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని, దానిని అనుకూలంగా మలచుకుంటూ నాయకులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌సిఎల్, ఉప ఎస్‌సిఎల్‌ను, హైస్ మాస్టర్లను ఎన్నుకున్నారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్ రధినీ చౌదరి అభినందించారు. కార్యక్రమంలో ఏఒ వెంకటరావు, యాజమాన్య సభ్యులు రత్నగిరిబాబు, మురళీమోహన్, కప్పుస్వామి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.